
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 18 జూలై 2024





ఖాశీంస్వామీ.. కాపాడయ్యా...

మార్మోగిన బత్తలపల్లి



భేటీకి వెళ్తున్న ఖాశీం స్వామి

వైభవంగా పీర్ల భేటీ
జనసంద్రమైన నాలుగురోడ్ల కూడలి
జలధికి తరలిన స్వామి

జనసంద్రమైన బత్తలపల్లి నాలుగురోడ్ల కూడలి



మిద్దెలపై నుంచి భేటీని తిలకిస్తున్న ప్రజలు



ఖాశీం స్వామితో భేటీ తీసుకుంటున్న పీర్లు



బత్తలపల్లి, జూలై 17: ఖాశీంస్వామి నామస్మరణతో బత్తలపల్లి మార్మోగింది. నాలుగురోడ్ల కూడలి జనసంద్రమైంది. స్వామితో పీర్ల భేటీని తిలకించేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మతసామరస్యానికి బత్తలపల్లి పీర్ల పండుగ ప్రతీకగా నిలుస్తోంది. ఉమ్మడి అనంత జిల్లాలో గూగూడు తర్వాత అత్యంత ప్రసిద్ధికెక్కాయి బత్తలపల్లి మొహర్రం వేడుకలు. చివరిరోజైన బుధవారం ఖాశీంస్వామి భేటీ కార్యక్రమం వైభవంగా సాగింది. తొలుత రకరకాల పుష్పాలు, వెండి ఆభరణాలతో ఖాసీంస్వామిని అలంకరించారు. పీర్లచావిడి నుంచి భక్తులకు దర్శనమిస్తూ నాలుగురోడ్ల కూడలికి చేరుకున్నారు. మండలంలోని గంటాపురం, వేల్పుమడుగు, పోట్లమర్రి, రాఘవంపల్లి, ముష్టూరుకు చెందిన పీర్లు తరలి వచ్చి, ఖాశీంస్వామితో సలామ్ (భేటీ) తీసుకున్నాయి. కార్యక్రమం సాగినంత సేపు బత్తలపల్లి నాలుగురోడ్ల కూడలి ఖాశీంస్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ భేటీని తిలకించేందుకు ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధికంగా హాజరయ్యారు. ఇలా భేటీ తీసుకోవడం ద్వారా అన్ని గ్రామాల ప్రజలు సోదరభావంతో కలిసిమెలసి ఉంటారని ఇక్కడి వారి నమ్మకం. భక్తులు మిద్దెలు పీర్ల భేటీని తిలకించారు. సాయంత్రం ఖాసీంస్వామి జలధికి తరలారు. మండలంలోని వెంకటగారిపల్లి వద్ద మాల్యవంతం, అనంతసాగరం, వెంకటగారిపల్లి, నార్శింపల్లి పీర్లు భేటీ తీసుకున్నాయి.

అలావ్ తొక్కుతూ..

ఖాశీంస్వామి, పీర్లు జలధికి వెళ్లే మకాన్ వద్దకు వచ్చిన భక్తులు అలావ్ తొక్కుతూ సందడి చేశారు. చిన్నపెద్ద, మహిళలు, వృద్ధులు అనే తేడా లేకుండా గుండం చుట్టూ, నాలుగురోడ్ల కూడలి వద్ద తప్పెట్ల తాళాలకు అలావ్ తొక్కారు.

పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచుతా

సైబర్ నేరాల కట్టడిపై ప్రత్యేక దృష్టి
జిల్లా నూతన ఎస్పీ రత్న
డీపీఓలో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి, జూలై 17: పోలీసు అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ శాఖపై ప్రజల్లో విశ్వాసం పెంచుతానని జిల్లా నూతన ఎస్పీ రత్న పేర్కొన్నారు. ఇటీవల జిల్లా ఎస్పీగా ప్రభుత్వం నియమించడంతో ఆమె బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయం(డీపీఓ)లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఏఆర్ సిబ్బంది నుంచి నూతన ఎస్పీ గౌరవవందనం స్వీకరించారు. ఏఎస్పీ విష్ణు, సిబ్బంది.. ఎస్పీకి పూలబొకేలు అందజేసి, స్వాగతం పలికారు. తన చాంబర్‌లోకి వెళ్లి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాకు ఎస్పీగా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజలకు మెరుగైన సేవలు, ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలైన ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ చేపడతామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచుతామన్నారు. సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఎస్పీకి ఆత్మీయ వీడ్కోలు



ఎస్పీ వాహనాన్ని తాళ్లతో లాగుతున్న సిబ్బంది

పుట్టపర్తి, జూలై 17: బదిలీపై వెళ్తున్న ఎస్పీ మాధవరెడ్డికి బుధవారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక పరేడ్ మైదానంలో ఏఆర్, హోంగార్డులు, సిబ్బంది ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మొదట ఎస్పీకి ఏఎస్పీ విష్ణు, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్ పరేడ్‌లోకి స్వాగతం పలికారు. ఓపెన్ టాప్ జీపులో ఎస్పీని ఉంచి, తాళ్లతో సిబ్బంది లాగారు. అనంతరం పోలీసు గౌరవవందనాన్ని ఎస్పీ స్వీకరించారు. పోలీసు జాగిలం.. ఎస్పీకి పూలబొకేను అందజేసి, ఆత్మీయ వీడ్కోలు పలికింది. ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిదన్నారు. బదిలీపై జిల్లాకు వచ్చే అధికారులకు కూడా ఇదే తరహాలో సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐలు చంద్రశేఖర్, వలీ, రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సత్తాచాటిన కొడిగెనహళ్లి విద్యార్థులు

ట్రిపుల్ ఐటీకి 22 మంది ఎంపిక.. ఉపాధ్యాయుల హర్షం

కొత్తచెరువు, జూలై 17: పరిగి మండలం కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఏకంగా 22 మంది ట్రిపుల్‌ఐటీకి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు బుధవారం ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో మహేశ్‌బాబు 600కిగాను 596 మార్కులు సాధించి, ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలకు టాపర్‌గా ఎంపికయ్యాడన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి 15 మంది, నూజివీడుకు కళాశాలకు ఐదుగురు, ఒంగోలులోని కాలేజీకి ఇద్దరు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.



ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

ఖాకీ మార్క్ పడేనా..!

వేధిస్తున్న సిబ్బంది కొరత
నేరచరితుల కదలికలపై కొరవడిన నిఘా
ప్రధాన రహదారుల్లోనే రాత్రిపూట గస్తీ
కాసులిస్తేనే కేసుల్లో కదలిక
గుప్పుమంటున్న గంజాయి
జిల్లా ఎస్పీకి సవాళ్ల స్వాగతం

పుట్టపర్తి, జూలై 17(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పురుడుపోసుకుని రెండేళ్లు దాటింది. ఏ జిల్లాకు లేనంత కర్ణాటక సరిహద్దు ఉంది. జిల్లాలో అన్ని పోలీసు స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. గత ప్రభుత్వంలో కొందరు ఖాకీలు.. అధికార పార్టీ సేవలో తరిస్తూ.. అపఖ్యాతి మూటగట్టుకున్నారు. చాపకింద నీరులా గంజాయి, పేకాట, మట్కా జూదం విస్తరిస్తోంది. పోలీసు నిఘా నేత్రం కొరవడి దోపిడీలు, చోరీలు, హత్యలు, చిన్నారులపై అఘాయిత్యాలు కొనసాగుతున్నాయి. జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాల్లో రాత్రిపూట పెట్రోలింగ్, నేరచేరితులు, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసు నిఘా సన్నగిల్లడంతో శాంతిభద్రతలపై పోలీసు శాఖ పట్టుతప్పిందన్న వాదనలున్నాయి. ఎన్నికల ముందు హిందూపురంలో ఎన్ఎస్‌యూఐ యువ నేత, న్యాయవాది సంపత్‌కుమార్‌ను కిరాతకంగా హత్య చేయడం కలకలం రేపింది. స్వగ్రామానికి వెళ్లేందుకు హిందూపురంలో బస్సు కోసం ఎదురు చూస్తున్న ఓ డ్రైవర్‌ను గంజాయి సేవించిన ఆకతాయిలు ద్విచక్రవాహనంలో డ్రాప్ చేస్తామని తీసుకెళ్లి, హత్య చేశారు. ఇటీవల వరుసగా చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతుండడం కలవరం రేపుతోంది. జిల్లాలో గంజాయి, మట్కా, గుట్కా పేకాట, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఎన్నికలు సుజావుగా జరిగినా చాలామంది బదిలీ ప్రయత్నాల్లో ఉండి పలు స్టేషన్లను గాలికొదిలేశారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారికి పోలీసు అంటే భయం ఉండేది. గత ఐదేళ్లు కొందరు పోలీసులు.. శాంతిభద్రతల పరిరక్షణను పక్కనబెట్టేసి వైసీపీ సేవలో తరించారన్న విమర్శలు మూటగట్టుకున్నారు. ప్రస్తుతం పాలకపక్షం మారడంతో వారంతా కూటమి ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారని సమాచారం. జిల్లాలో నేరాల అదుపునకు రాత్రిపూట పెట్రోలింగ్, అనుమానాస్పద వ్యక్తులు, నేరచేరితుల కదలికలపై నిఘా పెట్టి, కట్టడి చేసేవారు. ఇటీవలిగా రాజకీయ ప్రాబల్యం, ఫ్యాక్షన్, అత్యంత సమస్యాత్మకమైన ప్రాంతాల్లో నాకాబందీ, రాత్రిపూట గస్తీ ఊసే మరిచారు. అడపాదడపా వెళ్లడమే తప్ప.. నిత్య గస్తీ గల్లంతైంది. పోలీసు విభాగంలో జనరల్ డైరీ నమోదు చేస్తున్నా.. పూర్తిగా ఏడ్యూటీ ఎవరు, ఎక్కడ చేస్తున్నారన్న దానిపై పర్యవేక్షణ కరువైందన్న విషయం స్పష్టంగా కనిపిస్తోంది. కమాండ్ కంట్రోల్, డీటీసీతోపాటు పలు విభాగాలు ఉమ్మడి అనంతలోనే ఉంటూ కొత్త జిల్లాపై పని చేస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వీర్యమై, నేరనియంత్రణపై పట్టుకోల్పోతున్నారన్న వాదన ప్రజల్లో నెలకొంది. రాత్రిపూట గస్తీ ముమ్మరంగా సాగేది. డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టేవారు. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు లేకపోవడంతో యథేచ్ఛగా కర్ణాటక నుంచి మద్యం, గుట్కా జిల్లాలోకి వస్తోంది. ఇసుక, రేషన్ బియ్యం, ఎర్రచందనం జిల్లా మీదుగా అక్రమంగా రవాణా అవుతోంది. ప్రశాంతమైన జిల్లాలో కొన్నాళ్లుగా గంజాయి, మత్తు పదార్థాలు పట్టుబడుతుండడం కలవరపెడుతోంది. ఇటీవల జిల్లాలో జరుగుతున్న గొడవల్లో అధికంగా మద్యం మత్తులో తలెత్తినవే. రోడ్డు ప్రమాదాలు సైతం సాయంత్రం నుంచి రాత్రి పది గంటల మధ్యనే అధికంగా జరుగుతున్నాయి. జిల్లాలో ఆధిపత్య పోరు, వ్యక్తిగత, రాజకీయ కక్షలతో ప్రత్యర్థుల ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టిన ఘటనలు గతంలో కోకొల్లలు. జిల్లాలోని పలు పోలీసు స్టేషన్లు భూపంచాయితీలు, సెటిల్మెంట్లకు అడ్డాగా మారాయన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఉన్నతస్థాయి అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో వారు ఆడిందే ఆటగా మారింది. చాలా పోలీసు స్టేషన్లలో అసలు డబ్బులివ్వనిదే ఏపనీ జరగని పరిస్థితి నెలకొంది. ప్రతి దానికి ధరను నిర్ణయించి, ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా ఎస్పీగా బుధవారం బాధ్యతలు చేపట్టిన రత్న ముందు ఇన్ని సవాళ్లున్నాయి. వీటన్నింటినీ అధిగమించి, నూతన ఎస్పీ జిల్లాపై తన మార్క్ వేసుకుంటారో.. లేదో.. చూడాలి మరి.



ఘనంగా తొలి ఏకాదశి

కిక్కిరిసిన వైష్ణవాలయాలు



శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీనారసింహుడు



ముద్దిరెడ్డిపల్లిలో పాండురంగడి రథోత్సవం



పాండురంగడిగా పేట వేంకటేశ్వరస్వామి

హిందూపురం అర్బన్, జూలై 17: తొలి ఏకాదశిని జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పోటెత్తడంతో వైష్ణవాలయాలు కిక్కిరిశాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో మూలవిరాట్‌లకు వివిధ అభిషేకాలు, అర్చనలు చేశారు. దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. హిందూపురంలోని ప్రసిద్ధ పేట వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూలవిరాట్‌ను పాండురంగడిగా ముస్తాబు చేశారు. తెల్లవారుజామున విష్ణు సహస్రనామ పారాయణం గావించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. లక్ష్మీపురం బాలాజీ, గుడ్డం రంగనాథస్వామి ఆలయాల్లో విశేషపూజలు నిర్వహించారు.

దాళవాటంలో..

హిందూపురం సమీపాన సరిహద్దులో కర్ణాటక ప్రాంతం దాళవాటంలో అతి పురాతన దేవాలయంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నారసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకిలో దేవతామూర్తులను అధిరోహింపజేసి, ప్రాకారోత్సవం నిర్వహించారు.

కనులపండువగా పాండురంగడి రథోత్సవం

హిందూపురం పట్టణ పరిధి ముద్దిరెడ్డిపల్లిలో కొలువుదీరిన శ్రీ రుక్మిణీపాండురంగ స్వామి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూల విరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం రుక్మిణి, పాండురంగ స్వామిని అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో ఆశీనులు గావించి, పురవీధుల్లో ఊరేగించారు.

నూతన యంత్రంతో విత్తనం



విజయ్‌కుమార్

తగ్గనున్న పెట్టుబడులు.. ఓ ఉద్యోగి ప్రయోగం

మడకశిర రూరల్, జూలై 17: వేరుశనగ విత్తాలంటే రైతులు పెట్టుబడులకు వణికిపోతారు. ఎద్దులతో విత్తనం వేయాలంటే గొర్రు, గుంటక, ఎద్దులు, కూలీలు కావాలి. ట్రాక్టర్‌తో విత్తాలన్నా.. అద్దె, కూలీలు అవసరం. ఖర్చు తడిసి మోపెడవుతుంది. దీనికి చెక్ పెడుతూ ఓ ఉద్యోగి నూతన యంత్రాన్ని తీసుకొచ్చారు. దాంతోనే తన పొలంలో వేరుశనగ విత్తనం వేశాడు మండలంలోని గౌడనహళ్ళి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్. ఈ యంత్రం రైతులను ఆకట్టుకుంటోంది. చిన్నపాటి యంత్రం ఒక్కరే తోసుకుంటూ విత్తనం వేసుకోవచ్చని విజయ్‌కుమార్ తెలిపారు. ఈయన హైదరాబాద్‌లో సెరికల్చర్ శాఖలో పనిచేస్తున్నారు. స్వగ్రామంలో ఆయనకు రెండెకరాల పొలం ఉంది. అందులో వేరుశనగ విత్తాలనుకున్నాడు. కూలీలకు డిమాండ్, పెట్టుబడి ఖర్చులు విపరీతంగా ఉండడంతో అక్కడి నుంచే ఓ యంత్రాన్ని తెచ్చాడు. దీని విలువ రూ.7,500 అని చెప్పారు. ఇందులో చక్రానికి ఇనుప కొయ్యలు అమర్చబడి ఉంటాయి. పక్కనే ఓ పెట్టె ఉంటుంది. అందులో విత్తనాలు వేసుకోవాలి. యంత్రం తోసుకెళ్లేందుకు వీలుగా ఉంటుంది. దానిని తోసుకుంటూ వెళ్తుంటే.. పెట్టెలోని విత్తనాలు చక్రంలోకి చేరి, అక్కడి నుంచి ఒక్కొక్కటిగా కొయ్యల ద్వారా భూమిలోకి చేరతాయి. దుక్కి చేసిన పొలంలో ఆ కొయ్యలు భూమిలోకి చొచ్చుకెళ్లి, విత్తనాలు జారవిడుస్తాయి. అలా.. ఒక్కరే విత్తనం వేసుకోవచ్చని విజయ్‌కుమార్ తెలిపారు. యంత్రంతో విత్తనం వేసుకుంటే కూలీల అవసరమే ఉండదన్నారు. సన్న, చిన్న కారు రైతులుకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. ఈ యంత్రంతో వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, ఆముదం, కూరగాయ విత్తనాలు వేసుకోవచ్చన్నారు. యంత్రం సాయంతో ఆయన బుధవారం రెండెకరాల్లో 60 కేజీల వేరుశనగ విత్తనం సాగుచేశారు. అదిచూసిన రైతులు ఆశ్చర్యపోయారు. ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు ఇలాంటి పంట సాగుయంత్రాలను అందుబాటులోకి తీసుకురావలని రైతులు కోరుతున్నారు.



యంత్రంతో సాగు చేసిన విత్తనాన్ని పరిశీలిస్తున్న రైతు, విజయ్‌కుమార్



ఆధునిక యంత్రంతో వేరుశనగ విత్తనం వేస్తున్న విజయ్‌కుమార్


పాండురంగ చరిత్ర నాటికలోని ఓ సన్నివేశం

ప్రశాంతి నిలయంలో
ఘనంగా తొలి ఏకాదశి


పాటలు పాడుతున్న భక్తులు

పుట్టపర్తి, జూలై 17: ప్రశాంతినిలయంలో తొలి ఏకాదశి మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. వేదపఠనంతో వేడుకలను ప్రారంభమయ్యాయి. మరాఠ భక్తులు వాయిద్యగానంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం దిండిపల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. పండరీపుర భక్తులు పండరీశుని పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. సాయంత్రం బాలవికాస్ చిన్నారులు నామామృతం పేరిట డ్రామాను ప్రదర్శించారు. పాండురంగచరిత్ర నాటిక భక్తులను కట్టిపడేసింది. సత్యసాయిగ్లోబల్ కౌన్సిల్ ఛైర్మన్ చక్రవర్తి, సేవాసంస్థల జాతీయ అధ్యక్షుడు నిమీష్‌పాండే భక్తులకు శ్వేతవస్త్రాలను పంపిణీచేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని భక్తులు దర్శించుకున్నారు.

షిరిడీసాయి సేవలో రఘువీరా భిక్షాటన


భిక్షాటన చేస్తున్న రఘువీరా

మడకశిర, జూలై 17: పట్టణంలోని షిరిడీసాయిబాబా ఆలయంలో 21న గురుపౌర్ణమి సందర్భంగా బుధవారం నీలకంఠాపురం గ్రామంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రఘువీరారెడ్డి భక్తులతో కలిసి భిక్షాటన చేశారు. భిక్షాటన ద్వారా ప్రజలు అందించిన నిత్యావసర సరుకులను గురుపౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమంలో వినియోగించనున్నారు.

చీనీకాయలు టన్ను రూ.19వేలు

అనంతపురం రూరల్, జూలై 17: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.19 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.13 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపికశ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 465 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్



మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

అనంతపురం విద్య, జూలై 17: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 12వ పీఆర్సీకి సంబంధించిన ఐఆర్ ప్రకటించాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు సాయిశ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కార్యవర్గ సమావేశాలు జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన సీపీఐ కార్యాలయంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరైన సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు రివర్స్ పీఆర్సీ రూపంలో చేదు గుళిక అందించిందన్నారు. వేల కోట్ల బకాయిలతో ఉద్యోగులను బాధించిందన్నారు. సమస్యలు కూడా వినకుండా ప్రశ్నించిన వారికి నోటీసులు ఇవ్వడంతోపాటు, అరెస్టులతో భయాందోళనలకు గురిచేసిందన్నారు. ఐదేళ్లపాటు ఉద్యోగ సంఘాల నాయకులకు కనీస గుర్తింపు కూడా ఇవ్వలేదంటూ మండిపడ్డారు. కొత్త ప్రభుత్వం 12వ పీఆర్సీలో భాగంగా వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను చెల్లించాలని, ఏపీజీఎల్ఐ ఫైనల్ పేమెంట్లు, గడువుతీరిన బాండ్ పేమెంట్లు చెల్లించేలా ఆర్థికశాఖను ఆదేశించాలని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన 117ను రద్దు చేయాలన్నారు. 3,4,5 క్లాసులను విలీనం చేయడం వల్ల తీరని నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే 117 రద్దు చేసి విద్యావ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రామాంజినేయులు, ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, ఇతర నాయకులు నాగరాజు, సూర్యుడు, చంద్రశేఖర్, జాఫర్, గోవిందు, శివయ్య చారి, రామన్న, సీపీఐ నేతలు నారాయణస్వామి, రాజారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో అన్న మృతి

తమ్ముడికి తీవ్రగాయాలు


మృతిచెందిన నరసయ్య


తీవ్రంగా గాయపడిన శంకర్

గుత్తి, జూలై 17: పెద్దవడుగూరు మండలం విరుపాపురం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. విరుపాపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు నరసయ్య(32), శంకర్ ఇద్దరూ కలిసి బైక్‌పై మొహరం వేడుకల్లో పాల్గొనేందుకు పెద్దవడుగూరుకు వెళ్లారు. అనంతరం స్వగ్రామానికి తిరిగి వస్తుండగా బైక్ అదుపు తప్పి బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని108 వాహనంలో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికీ నరసయ్య మృతిచెందినట్లు నిర్ధారించారు. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

మృత్యుతీగలు..!

- ప్రాణాలు తీస్తున్న విద్యుత్ వైర్లు
- మూడునెలల్లో 10మంది మృతి
- క్షేత్రస్థాయిలో స్పందించని విద్యుత్ సిబ్బంది
- సొంతంగా మరమ్మతులకు దిగి.. మృత్యువాతపడుతున్న వైనం


నార్పల మండలం చాములూరులో విద్యుత్ లైన్ మరమ్మతులు చేసుకుంటున్నరైతు (ఫైల్)

అనంతపురంరూరల్, జూలై 17: విద్యుత్ తీగలు ప్రాణాలు తీస్తున్నాయి. ఇందుకు జిల్లాలో జరుగుతున్న సంఘటనలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. విద్యుత్ ప్రమాదాలబారిన పడి వినియోగదారులు, రైతులు ప్రాణాలను కోల్పోతున్నారు. ఇళ్లల్లో వెలుగులు నింపాల్సినా విద్యుత్ తీగలు ఆయా కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నాయి. మూడు నెలల్లో 10 మంది ప్రమాదాలకు గురై మృత్యువాతపడ్డారు. ప్రమాదాలకు క్షేత్రస్థాయిలో విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం ఎంతుందో అదేస్థాయిలో వినియోగదారుల తొందరపాటు తప్పిదాలు ఉంటున్నాయి. ఇళ్లల్లో సొంతంగా విద్యుత్ మర్మతులు చేసేందుకు పూనుకుని ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందిచకపోవడం కారణంగా పొలాల్లో రైతులు ప్రాణాలు వదులుతున్నారు. ప్రమాదాల నియంత్రకు చొరవ చూపాల్సిన సంబంధిత అధికారులు నిద్రమత్తులో జోగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రమాదాల నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా సంబంధిత అధికారులు చొరవ చూపకపోవడం రైతులు, వినియోగదారులు విద్యుదాఘాతాలతో మృత్యువాత పడుతున్నారు.

కనిపించని లైన్‌మెన్

క్షేత్రస్థాయిలో లైన్‌మెన్ల విధులు అత్యంత కీలకం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నాలుగు వందలమందికిపైగా లైన్‌మెన్లు పనిచేస్తున్నారు. వీరితోపాటు 600మంది ఎనర్జీ అసిస్టెంట్లు ఉన్నారు. జనాభాప్రాతిపదికన వీరికి ఒకటి లేదంటే రెండు మూడు గ్రామాలను కేటాయిస్తారు. అయినా వీరి నుంచి ప్రయోజనం ఉండటం లేదన్న విమర్శలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి. లైన్‌మెన్లు నిత్యం రైతులకు అందుబాటులో ఉండాల్సి ఉంది. అయితే అందుబాటులో ఉండటం లేదని క్షేత్రస్థాయిలో తెలుస్తోంది. లైన్‌మెన్లు అందుబాటులో ఉండని కారణంగా రైతులే సొంతంగా వ్యవసాయ బోర్లు, మోటార్ల వద్ద విద్యుత్ పరమైన పనులు చేసుకుంటున్నారు. అంతేకాకుండా విద్యుత్‌లైన్లలో సమస్యలు తలెత్తితే లైన్‌మెన్లు అందుబాటులో ఉండకపోవడంతో ఎక్కువ శాతం రైతులే మరమ్మతులను చేసుకుంటున్నారు. వాస్తవానికి విద్యుత్ లైన్లలో సమస్యలు తలెత్తితే లైన్‌మెన్లు ఎల్‌సీ తీసుకుని మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. అయితే క్షేత్రస్థాయిలో ఆ విధంగా జరగడం లేదు. ఇలాంటి సందర్భాల్లో రైతులే పనులకు పూనుకుని ప్రమాదాలకు గురై మృతిచెందుతున్నారు. అదే లైన్‌మెన్లు సకాలంలో స్పందించి మరమ్మతులు చేపడితే ఇలాంటి సంఘటనలు జరగవు. ఆ మేరకు సంబంధిత ఉన్నతాధికారులు చొరవచూపాల్సి ఉంది.

మూడునెలల్లో జరిగిన ప్రమాదాలివీ..

- ఏప్రిల్ 3న చెన్నెకొత్తపల్లి మండలం న్యామద్దల గ్రామంలో వీరనారమ్మ(45) ఉగాది పండుగను పురస్కరించుకుని ఇంటి గోడకు సున్నం వేస్తూ కరెంటు వైరు తగిలి విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది.
- ఏప్రిల్ 10న కణేకల్లు మండలం సొల్లాపురం గ్రామానికి చెందిన లాల్‌బాషా (30) రంజాన్ సందర్భంగా మసీదుకు ప్రార్థన నిమిత్తం వెళ్లాడు. కాళ్లు, చేతులు కడుక్కుని పక్కనే ఉన్న విద్యుత్ వైర్‌ను పొరపాటున తాకాడు. విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- మే 8న కళ్యాణదుర్గం మండలం ఓబుళాపురం గ్రామానికి చెందిన రైతు గొల్ల మనోహర్(32) తన వ్యవసాయ పొలంలో వెళుతుండగా సర్వీస్ వైర్ తగిలి విద్యుదాఘాతంతో చనిపోయాడు.
- జూన్ 2న గుమ్మఘట్ట మండలం పైదొడ్డి గ్రామానికి చెందిన రైతు పొలయ్య(49) పొలంలో వ్యవసాయ మోటర్ ఆన్ చేసేందుకు వెళ్లి స్టార్టర్‌కు కరెంటు సరఫరా కావడంతో ప్రాణాలు విడిచారు.
- జూన్ 11న కూడేరు మండలం అంతరగంగకు చెందిన గణేష్ (32) అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లిలో ఓ కొత్త బిల్డింగ్‌కు కడ్డీలు అమర్చేపనికి వచ్చాడు. ఆ సందర్భంగా ఆ ఇంటి ముందు వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు.
- జూన్ 14న రాప్తాడు మండలం భోగినేపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మన్న (60) కనగానపల్లి మండలం తగరకుంటలోని తన పొలంలో విద్యుత్ తీగ తగిలి చనిపోయాడు.
- జూన్ 20న నార్పల మండలం బొందలవాడ గ్రామానికి చెందిన రైతు చంద్రమౌళి పంటకు నీరు పెటేందుకు మోటారు ఆన్‌చేసి విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు.
- జూన్ 27న తనకల్లు మండలం కొండకింద పల్లిలో రైతు రమణ(40) తన పొలంలో పంటకు నీరు పెడుతుండగా మోటరు ఆగిపోయింది. స్టార్టర్‌కు ఫ్యూజు తగిలిస్తూ ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.
- జూలై 3న తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి గ్రామానికి చెందిన చంద్రయ్య(37) ఇంటి వద్ద తెల్లవారి 3 గంటల సమయంలో నీరు పట్టేందుకు మోటారు ఆన్‌చేశాడు. ఈక్రమంలో ఆయన మోటారును తాకడంతో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు.
- జూలై 16న కుందుర్పి మండలం బెస్తరపల్లికి చెందిన రైతు దేవరాజు (36) కౌలుకు సాగు చేస్తున్న పొలంలో పంటకు నీరు పెట్టేందుకు వెళ్లి మోటర్ ఆన్ చేశాడు. స్టార్టర్ పెట్టే మూత వేస్తున్న సందర్భంలో విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి వాతపడ్డారు.

స్టేషన్ వద్ద సీజ్ చేసిన ఇసుక మాయం

- సొంతింటి నిర్మాణానికి తరలించిన ఏఎస్ఐ
- చూసినా ప్రశ్నించని పోలీసులు
- సోషల్ మీడియాలో వైరల్



పోలీస్ స్టేషన్ వద్ద ఇసుకను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తున్న దృశ్యం


ఇసుకను ఏఎస్ఐ ఇంటివద్ద నిల్వ చేసిన దృశ్యం

హిందూపురం, జూలై 17: అక్రమంగా నదీ పరీవాహక ప్రాంతంలో తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించారు. ఎక్కువ రోజులు ఇసుక ట్రాలీలో ఉంటే ఇబ్బందని ఓ చోట డంప్ చేయించారు. అలా డంప్ చేయించిన ఇసుకను ఓ ఏఎస్ఐ పట్టపగలే ట్రాక్టర్లు పెట్టి సొంతింటి నిర్మాణానికి తరలించాడు. ఈ సంఘటన హిందూపురంలో చోటుచేసుకుంది. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొద్దిరోజుల క్రితం ఇసుక అక్రమంగా తరలిస్తుండగా పోలీసులను పట్టుకుని ఆ వాహనాల్ని స్టేషన్‌కు తరలించారు. అయితే కోర్టుద్వారా జరిమానా కట్టి వాహనాలను విడిపించుకెళ్లారు. వాటిలో ఉన్న ఇసుకను మాత్రం అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. అయితే అదేస్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎస్ఐ బుధవారం మధ్యాహ్నం ట్రాక్టర్ ద్వారా సొంతింటి నిర్మాణానికి ఆ ఇసుకను తరలించాడు. ఈ దృశ్యాల్ని కొందరు సోషల్ మీడియాలో షేర్ చేశారు. పోలీసులు ఇసుకను తరలిస్తుండటం చూశారే తప్ప ప్రశ్నించలేదు. ఎందుకంటే సదరు ఏఎస్ఐ తరచూ వివాదాస్పదంగానే వ్యవహరిస్తుంటాడు. దీంతో మాకెందుకని వారు మిన్నకుండిపోయారు. అంతేకాదు ఎన్నికల ప్రచార సమయంలో చంద్రబాబునాయుడు పెనుకొండకు వచ్చారు. ఆ రోజున ఆ ఏఎస్ఐని బందోబస్తుకు పంపారు. అయితే ఆయన జగన్ స్టిక్కర్ ఉన్న కారులో బందోబస్తు వెళ్లి అక్కడ హల్‌చల్ చేశాడు. ఆ దృశ్యాలు కూడా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల సెలవు ఇవ్వకపోవడంతో పైఅధికారిపై దురుసుగా ప్రవర్తించినట్లు పోలీస్‌శాఖలో చర్చ సాగుతోంది. కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌లో ఉంచుతారు. ఆ మద్యాన్ని సైతం ఆ ఏఎస్ఐ బయటకు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. తాజాగా నిబంధనలకు విరుద్ధంగా స్టేషన్‌వద్ద ఉన్న ఇసుకను సొంతింటి నిర్మాణానికి తరలించడంతో మరోమారు సోషల్ మీడియాలోకి ఎక్కాడు. గతంలో కూడా ఇక్కడ డంప్ చేసిన ఇసుకను వైసీపీ నాయకులు రెండు ట్రాక్టర్లలో పట్టణంలోని ఎంజీఎం పాఠశాల సమీపంలోని రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద చదును చేసేందుకు తీసుకెళ్లారు. మిగిలిన ఐదారు ట్రాక్టర్ల లోడ్ ఇసుకను ఏఎస్ఐ తరలించడం వివాదాస్పదంగా మారింది.

చట్టపరమైన చర్యలు తీసుకుంటాం: కంజక్షన్, డీఎస్పీ

పోలీస్‌స్టేషన్ వద్ద డంప్‌చేసిన ఇసుకను సొంతింటి నిర్మాణానికి తరలించి ఉంటే విచారించి చర్యలు తీసుకుంటాం. ఆ ఏఎస్ఐపై ఉన్నతాధికారులకు చర్యలు తీసుకునేందుకు నివేదిక పంపుతాం.

చిరు వ్యాపారి దారుణ హత్య

టవల్‌తో గొంతు బిగించి చంపిన మతిస్థిమితంలేని వ్యక్తి


హత్యపై విచారణ చేస్తున్న డీఎస్పీ బాబీజాన్‌సైదా


మృతుడు చిన్న అంజినప్ప (ఫైల్)

పెనుకొండ రూరల్, జూలై 17: పెనుకొండ మండలం గుట్టూరులో మంగళవారం రాత్రి ఆలయంలో నిద్రించిన చిరువ్యాపారిని మతిస్థిమితంలేని వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. పెనుకొండ కియ పోలీసు స్టేషన్ ఎస్ఐ రంగడు తెలిపిన మేరకు హిందూపురం పట్టణం బోయపేటకు చెందిన చిరువ్యాపారి ఎరుకల చిన్న అంజినప్ప(63) ఊరూరా తిరుగుతూ ఇత్తడి దీపాలు, హారతులు, ఇతర పూజాసామగ్రి అమ్ముకుని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో చిన్న అంజినప్ప హిందూపురం నుంచి మంగళవారం ఉదయం 5 గంటలకు పెనుకొండ మండలానికి వచ్చాడు. మునిమడుగు, చుట్టుపక్కల గ్రామాల్లో పూజాసామగ్రిని విక్రయించి, రాత్రి గుట్టూరులోని కొల్లాపురమ్మ ఆలయంలో నిద్రించాడు. గుట్టూరులో బుధవారం ఉదయం మొహరం వేడుకల్లో వ్యాపారం చేసుకుని, ఇంటికి వస్తానని కుటుంబ సభ్యులకు ఫోన్‌లో చెప్పాడు. ఆలయంలో నిద్రిస్తున్న చిన్న అంజినప్పను మునిమడుగు గ్రామానికి చెందిన మతిస్థిమితంలేని బోయ గంగాధర్ వచ్చి లేపాడు. ఇక్కడెందుకు పడుకున్నావని నిలదీశాడు. 'నన్ను చంపడానికి మా నాన్న పంపించాడు కదా..' అని గొడవపడి, దాడి చేశాడు. దీంతో చిన్న అంజినప్ప అర్ధరాత్రి సమయంలో గుట్టూరు నుంచి అమ్మవారిపల్లి వైపు పరుగులు తీశాడు. వెంబడించి పట్టుకున్న గంగాధర్.. అమ్మవారిపల్లి వద్ద 44వ జాతీయ రహదారి పక్కన మసీదు వద్ద టవల్‌తో చిన్న అంజినప్ప గొంతు బిగించి హత్య చేశాడు. అనంతరం కియ పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. బోయ గంగాధర్‌కు తండ్రితో కొంతకాలంగా స్థల వివాదాలున్నాయని, తనను చంపించేందుకు మనిషిని పంపించాడని భావించి.. అంజినప్పను చంపేసినట్లు విచారణలో తేలిందని ఎస్ఐ తెలిపారు. చిన్న అంజినప్ప తల్లి మంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేశామని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఎస్కేయూలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన సహ విద్యార్థినులు

అనంతపురం సెంట్రల్, జూలై 17: ఎస్కేయూ విద్యార్థిని మౌనిక బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. కడప జిల్లా పులివెందులకు చెందిన మౌనిక, ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వర్సిటీ బాలికల వసతి గృహంలోని తన గదిలో నైలాన్ తాడుతో ఉరివేసుకుంది. సహ విద్యార్థినులు సకాలంలో గమనించి సిబ్బంది సాయంతో రక్షించారు. వెంటనే సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అక్కడి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. విద్యార్థిని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. వర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, డిప్యూటీ వార్డెన్‌లు అనిత, శ్రీరాములు, ఎంబీఏ ప్రొఫెసర్‌లు ప్రభాకర్, మురళీకృష్ణ ఆసుపత్రికి చేరుకుని విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఇండస్ట్రియల్ టూర్‌లో భాగంగా ఈ నెల 10 నుంచి 16 వరకు కేరళ, తమిళనాడులోని పలు పరిశ్రమలను వర్సిటీ ఎంబీఏ విద్యార్థులు సందర్శించి వచ్చారు. ఆ సమయంలో సహ విద్యార్థులతో మౌనిక ఆనందంగా గడిపారని వర్సిటీ అధికారులు తెలిపారు. హాస్టల్ గదిలోని ఇతర విద్యార్థినులు అల్పాహారం కోసం వెళ్లిన తరువాత, ఉదయం 9.30 గంటల సమయంలో మౌనిక ఆత్మహత్యకు యత్నించిందని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సర్వజన వైద్యశాలకు వచ్చి బోరున విలపించారు. మౌనిక ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో తెలియరాలేదు. విద్యార్థిని కోలుకున్నాక విషయం తెలుస్తుందని వర్సిటీ వర్గాలు అన్నాయి. విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో ఇంకా తెలియదని, అందుకే కేసు నమోదు చేయలేదని ఇటుకలపల్లి సీఐ నరేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.

ప్రాణం పోశారు.. మౌనిక ఉరితాడుకు వేలాడుతుండగా గమనించిన సహ విద్యార్థినులు కేకలు వేసి హాస్టల్ సిబ్బందిని పిలిచారు. వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. మౌనికను కిందికి దించి.. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో సమయస్ఫూర్తి ప్రదర్శించారు. కింద పడుకోబెట్టి గుండె భాగంలో ఒత్తుతూ.. నోటితో ఊపిరి ఊదారు. దీంతో మౌనిక కళ్లు తెరిచింది. ఆ వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఉరి కారణంగా మెదడుకు ప్రాణవాయువు అందడం కష్టమౌతుందని, మౌనికకు సహ విద్యార్థినులు సీపీఆర్ చేయకపోయి ఉంటే ప్రాణాపాయం ఏర్పడేదని వైద్యులు అన్నారు. ప్రస్తుతానికి ప్రాణాపాయం లేదని, మరో 24 గంటలపాటు పరిశీలించాల్సి ఉందని అన్నారు.


సర్వజన వైద్యశాలలో మౌనికకు చికిత్స చేస్తున్నవైద్యులు

నార్పలలో దొంగల హల్‌చల్

మూడు ఇళ్లలో చోరీ
35 తులాల బంగారు, రూ.1.88 లక్షలు అపహరణ

నార్పల, జూలై 17: మండల కేంద్రమైన నార్పలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. మసీదు కట్ట కాలనీలోని మూడిళ్లలో చోరీ చేశారు. కాలనీలోని గాండ్ల ఓబయ్య ఇంటికి తాళాలు వేసి మిద్దెపైన నిద్రిస్తుండగా దుండగులు ఇంటి తలుపులను పగలగొట్టి బీరువాలోని రూ.80వేలు, 28తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన గందోడి వేణుగోపాల్ ఇంటికి తాళం వేసి కుంటుంబ సభ్యులతో గూగూడుకు వెళ్లాడు. ఆ ఇంటి తలుపులు, బీరవాను పగలగొట్టి రూ.లక్ష, ఆరు తులాల బంగారు నగలను ఎత్తుకెళ్లారు. అదే కాలనీకి చెందిన మెకానిక్ ఈషాన్ గూగూడుకు వెళ్లాడు. దొంగలు ఇంట్లోకి చొరబడి జత కమ్మలు, రూ.8వేలు చోరీ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు క్లూస్‌టీంను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అటవీశాఖలో ఉద్యోగోన్నతుల వివాదం

సీపీఎఫ్ దృష్టికి సమస్య

అనంతపురం న్యూటౌన్, జూలై 17: అటవీశాఖ అనంతపురం సర్కిల్ కార్యాలయంలో డీఆర్వో ఉద్యోగోన్నతుల వ్యవహారం వివాదాస్పదమైంది. అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఎఫ్‌బీఓల నుంచి సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగోన్నతు లు కల్పించే ప్రక్రియ ముగిసింది. సర్కిల్ కార్యాలయం నుంచి సెక్షన్ ఆఫీసర్లలో అర్హులకు డీఆర్వోలుగా ఉద్యోగోన్నతులు కల్పిస్తున్నారు. ఇప్పటికే ఇద్దరికి ఉద్యోగోన్నతి కల్పించి, కళ్యాణదుర్గానికి ఒకరిని, రాయదుర్గం మరొకరిని డీఆర్వోగా కేటాయించారు. ఖాళీగా ఉన్న మూడోస్థానాన్ని భర్తీ చేసేందుకు సీసీఎఫ్ కార్యాలయం చర్యలు తీసుకుంది. పెనుకొండ రేంజ్‌లోని మడకశిర సెక్షన్ ఆఫీసర్‌గా ఉన్న కుళ్లాయప్పకు ఉద్యోగోన్నతి కల్పి స్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని సమాచారం. అయితే సర్కిల్ పరిధిలో అనంతపురం జిల్లాతో పాటు చిత్తూరు జిల్లాలో కూడా కుళ్లాయప్ప కంటే సీనియర్స్ ఉన్నామని కొందరు తెరపైకి వచ్చారు. సీసీఎఫ్ నాగేశ్వరరావును అర్హులు కలిసి తమకు న్యాయం చేయాలని కోరినట్లు తెలిసింది. విషయం తన దృష్టికి వచ్చిందని, ఉద్యోగోన్నతి ఉత్తర్వులను హోల్డ్‌లో ఉంచామని సీసీఎఫ్ తెలిపారు.

తుంగభద్ర జలాశయానికి పెరిగిన ఇన్‌ఫ్లో

బొమ్మనహాళ్, జూలై 17: తుంగభద్ర జలాశయంలోకి బుధవారం ఉదయం 8 గంటలకు 63,320 క్యూసెక్కుల వరదనీరు చేరింది. ప్రస్తుతం తుంగ జలాశయం నుంచి 70,497 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో తుంగభద్ర జలాశయానికి మరింత వరదనీరు చేరనుందని అధికారులు తెలిపారు. జలాశయ గరిష్ఠ మట్టం 1633 అడుగులకు గాను 1611 అడుగులకు చేరింది. ప్రస్తుతం జలాశయంలో 40 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

టమోటా కిలో రూ.62

అనంతపురం రూరల్, జూలై 17: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.62తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. బుధవారం 200 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.54, కనిష్ఠ ధర రూ.45 పలికినట్లు ఆయన తెలిపారు.

ఎన్‌ఐటీలో అనంత విద్యార్థులకు సీట్లు


మౌర్యతేజ


గౌరీశంకర్

అనంతపురం సెంట్రల్, జూలై 17: దేశవ్యాప్తంగా ఇంజనీరింగ్ కళాశాలల ప్రవేశాలకు నిర్వహించే జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్(జేఈఈ)లో అర్హత సాధించిన విద్యార్థులకు జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ(జోసా) కౌన్సెలింగ్ నిర్వహించింది. ఇందులో జిల్లా విద్యార్థులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) సీట్లు దక్కాయి. ఇందుకు జోసా పుదుచ్చేరి ఎన్ఐటీలో మౌర్యతేజ, సూరత్‌కల్ ఎన్ఐటీలో గౌరీశంకర్ సీట్లు సాధించారు. ఇద్దరికీ సివిల్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లో సీట్లురావడం విశేషం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పదుల సంఖ్యలో సీట్లు వచ్చాయని అధికార వర్గాలు తెలిపాయి.




తారకరామాపురంలో అక్కమ్మదేవతలు సుబ్బరాయునిపల్లె వద్ద అక్కమ్మదేవత

ఘనంగా అక్క దేవతల పరుష

ధర్మవరం, జూలై 17: స్థానిక తారకరామాపురంలో అక్కదేవతల పరుష మహోత్సవాన్ని బుధవారం పూజారులు గుంజరమహేశ్, బయన్న ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం అక్కదేవతలకు పంచామృతాభిషేకం, పుణ్యాహవాచనం, సూక్తపారాయణం జరిపి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అనంతరం గుట్టకిందపల్లి వంకలో అక్కమ్మదేవతల జలదీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుమునుపు గుట్టకిందపల్లికి చెందిన కేశమ్మ, బాలు కుటుంబసభ్యులు అమ్మవారికి ఏడు తులాల వెండి నాగపడిగను బహూకరించారు.

ఎడ్లబండ్ల పోటీలు

పుట్టపర్తి : దొడ్డిగుండ్ల అక్కమ్మగారి ఎడ్లబండ్ల పోటీలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని సుబ్బరాయునిపల్లి సమీపంలో చిత్రావతి నది ఒడ్డు ఉన్న దొడ్డిగుండ్ల అక్కమ్మ దేవతలకు చిన్నారులతో కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారి పూజలలో వందలాది మంది మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు. ప్రథమ బహుమతిగా నల్లగుట్టపల్లి రాము రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా కొత్తచెరువుకు చెందిన కోళ్ల కేశవ రూ.8వేలు, తృతీయ బహుమతిగా రూ.6వేలను బుక్కపట్నంకు చెందిన జంగం శ్రీనివాసులు ఎద్దులు గెలుపొందాయి. బీజేపీ నాయకుడు డాక్టర్ రాఘవేంద్ర భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నారా లోకేశ్‌తో పరిటాల శ్రీరామ్ భేటీ



ధర్మవరం, జూలై 17: విద్య, ఐటీశాఖ మంత్రి నారాలోకేశ్‌ను ఉండవల్లిలోని ఆయన నివాసంలో ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం భేటీ అయ్యారు. నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతంపై చర్చించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి అంశాలను నారాలోకేశ్ దృష్టికి తీసుకెళ్లారు.

కదిరి-ఎన్పీకుంట రహదారి పనులు ప్రారంభం



కదిరి, జూలై 17: కదిరి, ఎన్పీ కుంట మధ్య రహదారి మరమ్మతులు, విస్తరణ పనులను తొలి ఏకాదశి రోజైన బుధవారం పూజలు చేసి.. పనులు ప్రారంభించారు. నాలుగు సంవత్సరాలుగా ఈ రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. అయినా వైసీపీ ప్రభుత్వంలో పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్‌డీబీ పథకం కింద ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ప్రాజెక్టుకు నిధులు బ్యాంక్ ఇచ్చినా, వైసీపీ ప్రభుత్వం వాటిని దారి మళ్లించింది. దీంతో ఈ రోడ్డు పనులు అర్థాంతరంగా ఆగిపోయాయి. కందికుంట వెంకటప్రసాద్ ఎన్నికల హామీలో భాగంగా కదిరి, ఎన్పీకుంట రోడ్డు మరమ్మతులు చేయడంతో పాటు రోడ్డు విస్తరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో విజయం సాధించి.. ఎమ్మెల్యే అయిన తర్వాత ఇటీవల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మూడు నెలలో ఈ రోడ్డును పూర్తి చేస్తామని స్పష్టం చేశాడు. ఆ మేరకు ఈ రోడ్డు పనులు ప్రారంభించడంతో ప్రయాణీకులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రెండోరోజూ కొనసాగిన న్యాయవాదుల రిలేదీక్ష



రోజు దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

కదిరిలీగల్, జూలై 17: న్యాయవాది రామస్వామిపై దాడి చేసిన నితిన్‌ను వెంటనే అరెస్టు చేయాలని న్యాయవాదులు స్థానిక కోర్టు సమీపంలో ప్రారంభించిన రిలే నిరాహార దీక్ష రెండో రోజైన బుధవారమూ కొనసాగాయి. దీక్షలో రామస్వామి పాల్గొన్నారు. ఈ దీక్షకు పాల ఏకీరి సంఘం నాయకులు మద్దతు తెలిపారు. దాడి చేసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు లయన్స్‌క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

ధర్మవరం, జూలై 17: ధర్మవరం పట్టణంలోని లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేస్తున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు పిట్టా వెంకటస్వామి తెలిపారు. లక్ష్మీచెన్నకేశవపురంలోని లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేణుగోపాలచార్యులు, కార్యదర్శిగా ఆకులేటి రమేశ్‌బాబు, కోశాధికారిగా ఉలవల నాగేంద్ర, ఉపాధ్యక్షుడిగా ఉట్టిప్రసాద్, చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, పుట్లూరు నరసింహులు, క్లబ్‌సర్వీసు చైర్మన్‌గా కొత్తశ్రీరాములు, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా గోసే రాధాక్రిష్ణ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్ రమేశ్‌నాథ్‌రెడ్డి హాజరవుతున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి



బుక్కపట్నంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎనుములపల్లిలో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



కదిరి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మవరంరూరల్, జూన్ 17: తొలిఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో శ్రీజగన్నాధుడు, సుభద్ర, బలరామ ప్రతిమలకు విశేషంగా అలంకరించి హరినామ సంకీర్తనలు చేశారు. ఏకాదశి పర్వదినం రోజు ఉపవాసంతో శ్రీకృష్ణభగవానుని నామస్మరణ చేసుకుంటే ఎంతో పుణ్యఫలం సిద్ధిస్తుందని ధర్మవరం ఇస్కాన్ ధర్మప్రచారకులు శ్రీకృష్ణమాధవదాస్ భక్తులకు తెలిపారు. అలాగే పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయంలో తొలిఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు.

● పుట్టపర్తి : ఆషాఢ మాస ఏకాదశి సందర్భంగా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం జగరాశిపల్లి వద్ద ఉన్న ఓబులేశుస్వామి కొండకు భక్తులు క్యూకట్టారు. కొండమీద ఓబులేశుస్వామికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. వందలాది మంది భక్తులు ఉపవాస దీక్షతో స్వామికి ముడుపులు చెల్లించుకున్నారు. స్థానిక ఎనుములపల్లిలో హరిహరక్షేత్రంలో వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

● ధర్మవరం : పట్టణంలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు రాజేశ్ పట్టువస్త్రాలు, వివిధరకాల పూలు, తులసీ ఆకులు, ఆభరణాలతో అలంకరించి పూజలు చేశారు. లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అన్నమయ్యసేవా మండలి అధ్యక్షుడు పోరాళ్ల పుల్లయ్య అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు.

● కొత్తచెరువు : మండలంలోని పాతదేవరపల్లిలో స్వయంభు శ్రీచెన్నకేశవస్వామి ఆలయంలో పురోహితులు ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తచెరువులో నాగులకనుమ, సోమేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీచెన్నకేశవ స్వామికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. భక్తులు తొలిఏకాదశి రోజున ఉపవాస దీక్షలు నిర్వహించి స్వామికి పూజలు నిర్వహించారు.

● కదిరి: పట్టణంలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేకఅభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారి దర్శనానికి అధిక సంఖ్యలో వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ధ్వజ స్తంభం వద్ద భక్తులు దీపాలు వెలిగించారు.

● ఓబుళదేవరచెరువు: కొండకమర్లలో చెన్నకేశస్వామికి అభిషేకాలు, అర్చనలు, అలంకరణను పూజారి మాడుగుల సత్యనారాయణ నిర్వహించారు. మండల కేంద్రంలో ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు.

● బుక్కపట్నం: బుక్కపట్నం చెరువులోని చిక్కవడియా ఈశ్వర్ దేవాలయం, అక్కదేవతలు, చౌడేశ్వరీ, చిన్ననాగమ్మ దేవాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో వందలాదిమంది భక్తులు పాల్గొన్నారు.






ధర్మవరంలో తులసి అలంకరణలో లక్ష్మీచెన్నకేశవుడు, పాతదేవరపల్లిలో చెన్నకేశవస్వామి, జగరాశిపల్లి వద్ద కొండమీద ఓబిలేశుస్వామి, ధర్మవరం ఇస్కాన్ ఆలయంలో స్వామి, అమ్మవార్లు

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

ధర్మవరం రూరల్, జూన్ 17: మండలంలోని పోతుకుంట గ్రామం ఎస్సీకాలనీలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలను బుధవారం వైభవంగా నిర్వహించారు. మూడు రోజులు నిర్వహించే ఈ ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టమైన పంజుశ్యావాతో గ్రామంలో ఊరేగించారు. స్వామి ఆవహించిన పూజారి పంజుశ్యావాతో ఉరుములు, డప్పులతో గ్రామపురవీధుల్లో తిరుగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఘట్టాన్ని భక్తులు తిలకిస్తూ పెద్దఎత్తున లక్ష్మీనరసింహస్వామి గోవిందనామస్మరణ చేశారు. ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఆలయంలో భజనలు చేశారు.



పంజుశ్యావాతో తిరుగుతున్న పూజారి



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

హమాలీలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలి

ధర్మవరం రూరల్, జూలై 17: సివిల్ సప్లై హమాలీలకు ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డులో ధర్మవరం, చెన్నేకొత్తపల్లి, బుక్కపట్నం మండలాల్లోని సివిల్‌సప్లై స్టాక్‌పాయింట్ల హమాలీల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. హమాలీల జిల్లా అధ్యక్షుడు నేలకోటప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సత్యసాయి జిల్లాలో 12 స్టాక్ పాయింట్‌లో 200 మందికిపైగా హమాలీలు ఉన్నారని, సివిల్‌సప్లై హమాలీలకు ప్రతి నెలా డీలర్స్ నుంచి వస్తున్న కూలి చెల్లింపులో నిర్లక్ష్యధోరణి జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కూలి చెల్లింపులు ప్రతినెల సక్రమంగా చెల్లించాలని, పీఎఫ్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 70 మంది హమాలీలకు సంబంధించి మస్టర్లలో పేరు ఎక్కించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పౌరసరఫరాల వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, కోశాధికారి రాందాసు, మేస్త్రీలు ఆంజనేయులు, గంగాధర్, కదిరప్ప, కోటప్ప, సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, జిల్లా నాయకులు జేవీ రమణ, ఎస్‌హెచ్‌బాషా, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, మారుతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

సీఐటీయూ మండల కమిటీ ఎంపిక

ఓబుళదేవరచెరువు, జూలై 17: సీఐటీయూ నూతన మండల కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, సీనియర్ నాయకులు రమణ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా కుళ్లాయప్ప, కో కన్వీనర్ పోరాట శ్రీరాములు , సభ్యులు కేశవ, శ్రీనివాసులు, అంగన్‌వాడీ వరలక్ష్మీ, మణిమాల, శ్రీనాథ్, రమణమ్మ, నిర్మలమ్మ, భాగ్యమ్మ, సుగుణమ్మ, లక్ష్మీదేవి, సాలెమ్మ, ఇందిరమ్మ, రామలక్ష్మమ్మను ఎన్నుకున్నారు.

విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పాలి



ధర్మవరంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న పాత్రికేయులు

ధర్మవరం, జూలై 17: జర్నలిస్టులు, మీడియాపై రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ ధర్మవరం ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో పాత్రికేయులు బుధవారం నిరసన ర్యాలీ చేపట్టారు. కాలేజ్ సర్కిల్ నుంచి కళాజ్యోతి సర్కిల్ వరకు నిరసన ఈ ర్యాలీని కొనసాగించి అంబేద్కర్ విగ్రహం ఎదుట విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ముసుగుమధు మాట్లాడుతూ... రాజ్యసభ సభ్యుడిగా ఉంటూ మీడియా ప్రతినిధులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వాస్తవాలను నిర్భయంగా ప్రచారం చేస్తే బెదిరిస్తారా అని మండిపడ్డారు. మీడియా ప్రతినిధులకు విజయసాయిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో టీడీపీ నాయకులు కిరోసిన్ పోతలయ్య, కత్తుల బాబ్జీ, నాగరాజు, జనసేన నాయకులు బాలక్రిష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, బీజేపీ నాయకులు శంకరచంద్ర, గట్టునాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు రామాంజినేయులు, పెద్దన్న, యాదగిరి, రామక్రిష్ణ, ప్రెస్‌క్లబ్ కమిటీ అధ్యక్షుడు జానపాటి మోహన్, పాత్రికేయులు రమేశ్ నాయుడు, శ్రావణ్, రాజా, గ్రంధే శ్రీనివాసులు, మజ్జిగ భాస్కర్, దేవేంద్ర, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్య జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కొత్తచెరువు, జూలై 17: పుట్టపర్తిలోని గణేశ్‌సర్కిల్‌లో ఏకలవ్య జయంతి వేడుకలను బుధవారం ఎరుకుల కులస్థులు ఘనంగా నిర్వహించారు. కూడలిలో ఏకలవ్య బ్యానర్‌ను ఉంచి పూలమాలలు వేశారు. ఏకలవ్య చరిత్రను ఈ సందర్భంగా గుర్తుకు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకుల రాయలసీమ సంఘం సెక్రటరీ గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, యూత్ అధ్యక్షుడు వేణు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కొత్తచెరువు, జూలై 17: మండలంలోని కేశాపురం, కొడపగానిపల్లి, కనుముక్కల జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్న 12 మంది విద్యార్థులకు బుధవారం సైకిళ్లను పంపిణీ చేసినట్లు తిరుమలదేవరపల్లి పాఠశాల హెచ్‌ఎం ఓ ప్రసాద్ తెలిపారు. ఈ సైకిళ్లను సత్యసాయి బాబా భక్తుల సహకారంతో అందజేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చెన్నక్రిష్టారెడ్డి, లక్ష్మీనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

నంబులపూలకుంట, జూలై 17: ఉమ్మడి అనంతపురం జిల్లా కేంద్రంలో శ్రీసత్యసాయి జిల్లా ఎస్టీయూ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డిని రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ముళ్ల రఘునాథ్‌రెడ్డి బుధవారం సన్మానించారు. 18 సంవత్సరాలుగా వివిధ పదవుల్లో కొనసాగుతూ... ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో ఆయన్ను సన్మానించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ సూరీడు, రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, నాయకులు సుధాకర్, శ్రీనివాసులు, గోవిందునాయుడు పాల్గొన్నారు.

గ్రామీణులకు స్వచ్ఛమైన నీరు అందించాలి

ముదిగుబ్బ,జూలై 17: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించాలనే ఉద్దేశంతోనే కేంద్ర ప్రభుత్వం జలజీవన్ పథకాన్ని ప్రవేశ పెట్టిందని జల జీవన్ మిషన్ కేంద్ర బృందం అధికారులు అనీల్ కుమార్ బారి, శశికుమార్ బాషిర్ పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని సంకేపల్లి, సానేవారిపల్లి పంచాయతీల్లో ఇంటింటికి తాగునీటి సరఫరా విధానం, నీటి నాణ్యత, వ్యక్తిగత మరుగుదొడ్లు, పారిశుధ్య పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూయస్ డీఈ శాంతన్న, ఈఓఆర్‌డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

ఓబుళదేవరచెరువు, జూలై 17: స్థానిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నివారణ, బాధితుల గుర్తింపు, ఎల్‌సీడీ కార్యక్రమాలపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ భాను ప్రకాష్ నాయక్ మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది ద్వారా ఇంటింటి సర్వేతో అనుమానిత వ్యక్తులకు పరీక్షలు నిర్వహిస్తారని, చికిత్సలు, ఉచిత మందులు పంపిణీ చేస్తారని అన్నారు. బాధితులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ కూడా సిఫార్సు చేస్తామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కమల్‌రోహిత్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్యపర్యవేక్షకులు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.



తనకల్లు బైరాని గుట్ట వద్ద భేటీ అయిన పీర్లు



గొట్లూరులో ఊరేగుతున్న పీర్లు



ధర్మవరంలో జలధికి వెళ్తున్న పీర్లు

వైభవంగా జలధి

కదిరి, జూలై 17: మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లలో మొహరం పండుగ సందర్భంగా బుధవారం జలధి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. నాలుగు రోజుల నుంచి పీర్లను పీర్లచావిడితో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీర్లను పుర వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ ఊరేగిస్తూ గ్రామ శివారుల్లో జలధికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఈ ఉత్సవంలో పాల్గొన్నారు.

● ధర్మవరం: పట్టణంలోని కొత్తపేట, సిద్దయ్యగుట్ట, యాదవవీధి, తేరుబజారు తదితర ప్రాంతాల్లో మొహర్రం ఉత్సవాలలో భాగంగా పీర్లస్వాములు బుధవారం జలదీకి తీసుకెళ్లారు. పీర్లస్వాములను వివిధ రకాల పూలమాలతో అలకరించి అగ్ని గుండప్రవేశం చేశారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ఊరేగిస్తూ.. జలధికి తీసుకెళ్లారు.

● ధర్మవరంరూరల్: మండలంలోని మల్కాపురం గ్రామంలో మొహరం ఉత్సవాల్లో భాగంగా బుధవారం పీర్లు జలధికి తరలివెళ్లారు. సాయంత్రం గుండం పూడ్చివేసి గ్రామంలో పీర్లను ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు. యువకులతో పాటు మహిళలు, వృద్ధులు సైతం గుండంచుట్టూ అలావ్ తొక్కుతూ సందడి చేశారు. అలాగే గొట్లూరు గ్రామంలో పెద్దసరిగెత్తు కార్యక్రమం రాత్రి ఘనంగా నిర్వహించారు.

● అమడగూరు: మండలంలో మొహరం వేడుకలను ముజావర్లు బుధవారం ప్రారంభించారు. పీర్లను శుభ్రం చేసి చావిడిలో కొలువుతీర్చారు. వేడుకలను ఎనిమిది రోజుల పాటు నిర్వహిస్తారు.

● తాడిమర్రి : పెద్దసరిగెత్తును పురష్కరించుకుని పీర్లను అందంగా అలంకరించి ఊరేగించారు. అగ్ని గుండప్రవేశం చేయించారు.

● నల్లమాడ: మండలంలోని పుల్లగూర్లపల్లి, గోపేపల్లి గ్రామాల్లో బుధవారం ఘనగా జలధి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

● గాండ్లపెంట: గాండ్లపెంట, వేపరాల, తూపల్లి, కటకంవారిపల్లి, కటారుపల్లి, గొడ్డువెలగల, మల్లమీదపల్లి తదితర గ్రామల్లో పీర్లను ప్రత్యేకంగా ఆలకరించారు. పీర్లచావిడి వద్ద ఆగ్నిగుండం ఏర్పాటు చేశారు. తప్పెట్లు వాయిద్యలతో ఆగ్నిగుండం చుట్టూ పిల్లలు, పెద్దలు అల్లావ్ తొక్కారు. ఆయా గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. బుధవారం గాండ్లపెంట సమీపాన జలధికి తీసుకెళ్లారు.

● తనకల్లు : మండలంలోని బైరానిగుట్ట వద్ద బుధవారం కోటూరు, తనకల్లు, ఉస్తిలిపల్లి, దుగినేపల్లి, కుంటమర గ్రామాలకు చెందిన పీర్లు భేటీ అయ్యాయి. సలాలు అందుకున్నాయి. అనంతరం జలధి కార్యక్రమాన్ని ఆయా గ్రామాల్లో నిర్వహించారు.



గాండ్లపెంటలో జలధికి వెళ్తున్న పీర్లు



కదిరిలో మంగళవాయిద్యాల నడమ ఊరేగింపు



మల్కాపురంలో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



తాడిమర్రిలో పీర్ల ఊరేగింపు

నేడు రొద్దంలో మంత్రి పర్యటన

పెనుకొండ టౌన్, జూలై 17: బీసీ సంక్షేమం, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత గురువారం రొద్దం మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ నాయకులు బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపారు. గురువారం ఉదయం 11గంటలకు రొద్దం మండలం కోగిర చెరువు మరువ, 11.30కు పెద్దకోడిపల్లి చెరువు పరిశీలించనున్నట్లు తెలిపారు. గ్రామస్థులతోపాటు సంబంధిత శాఖాధికారులు హాజరు కావాలన్నారు.

కౌలు రైతు గుర్తింపు కోసం నమోదు చేసుకోండి

అగళి, జూలై 17 : మండలంలో ఉన్న సొంత వ్యవసాయ భూమి లేకుండా మరొకరి భూమి కౌలు చేస్తున్న రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రాల్లో రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ శేఖర్ నాయక్ తెలిపారు. కౌలు రైతులకు ప్రభుత్వం పంట సాగు హక్కు పత్రం ఇస్తుందన్నారు. దీని ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు కౌలు రైతులకు అందుతాయన్నారు.

గురుపౌర్ణమి వేడుకల కోసం భిక్షాటన

గోరంట్ల, జూలై 17: మండలంలోని బూడిదగడ్డపల్లి షిర్డీసాయిబాబా ఆలయంలో ఈనెల 21న గురుపౌర్ణమి వేడుకలను సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు అర్చకులు నారాయణ నంద స్వామి తెలిపారు. అభిషేకం, అర్చన, మహామంగళహారతి, అన్నదానం నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం సేవాసమితి వారు ప్రత్యేక రథంలో బాబా విగ్రహం ఉంచి మండలంలోని గ్రామాల్లో తిరుగుతూ బిక్షాటన చేపట్టారు. ప్రజల నుంచి అన్నదానం కోసం బియ్యం, బేడలు, నిత్యావసర వస్తువులు సేకరిస్తున్నారు. ఆదివారం జరిగే గురుపౌర్ణమి వేడుకల్లో భక్తులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

మారెమ్మ దేవతకు ఘనంగా పూజలు

గుడిబండ, జూలై 17: మండలంలోని మద్దనకుంట గ్రామంలో వెలసిన మారెమ్మ దేవతకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ అధికారంలోకి వస్తే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అన్నదానం చేపడతామని మొక్కుకున్నట్లు దిన్నెహట్టి గ్రామానికి చెందిన టీడీపీ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, మాజీ సర్పంచ్ సన్నమారెప్ప తెలిపారు. టీడీపీ అధికారంలోకి రావడంతోపాటు మడకశిర ఎమ్మెల్యేగా ఎంఎస్ రాజు గెలుపొందడంతో టీడీపీ నాయకులు అమ్మవారికి హారతులిచ్చి అన్నదానం చేపట్టారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస మూర్తి, నాయకులు లక్ష్మీనరసప్ప, దుర్గేష్, బీమరాజు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు మంజునాథ్, షబ్బీర్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేడు చల్లాపల్లిలో ఉట్లపరుష

హిందూపురం(సోమందేపల్లి), జూలై 17: మండలంలోని చల్లాపల్లిలో గురువారం ఉట్లపరుష నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కదిరేపల్లి నరసింహస్వామికి బుధవారం చల్లాపల్లి, కదిరేపల్లి, ఓబుళదేవరపల్లి గ్రామాలకు చెందిన మహిళలు జ్యోతులతో గుడిచుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామిని దర్శించుకున్నారు. ఉట్లమానుకు పూజలు చేశారు. గురువారం ఉట్లపరుషకు భక్తులు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రామక్రిష్ణ, సంజీవరెడ్డి, ఆర్డీడీ డీఎస్పీ తిమ్మారెడ్డి, నరసింహులు, రామాంజి, లోకేష్, శ్రీనివాసులు, నారాయణప్ప పాల్గొన్నారు.

నేడు 1కే వాక్

పెనుకొండ టౌన్, జూలై 17: హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ గురువారం సీనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి వాసుదేవన్ ఆధ్వర్యంలో 1కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కోర్టు అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9గంటలకు పెనుకొండ కోర్టు ఆవరణం నుంచి అంబేడ్కర్ సర్కిల్‌లోని తెలుగుతల్లి విగ్రహం వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయాధికారులు ముజీబ్ పసపల సయ్యద్, బుజ్జప్ప పాల్గొంటారన్నారు.

400 రోజులకు చేరిన అన్న క్యాంటీన్



అన్న క్యాంటీన్‌లో భోజనం వడ్డిస్తున్న నాయకులు

పెనుకొండ టౌన్, జూలై 17: బీసీ సంక్షేమం, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో పెనుకొండలో అన్న క్యాంటిన్ ఏర్పాటు చేసి బుధవారం 400రోజులకు చేరుకుంది. దీంతో టీడీపీ నాయకులు అన్న క్యాంటిన్ వద్దసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో ఇబ్బందులు పెట్టినా నిరుపేదలకు పట్టెడన్నం పెట్టాలన్న సంకల్పంతో మంత్రి సవిత ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. నేటికి 400రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. రోజూ 300మందిదాకా రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామన్నారు. దీనికి మంత్రి నిరంతరాయంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ వెంకటరమణ, మాధవనాయుడు, గుట్టూరు సూరి, త్రివేంద్ర, పట్టణ కన్వీనర్ శ్రీరాములు, రమణమ్మ, దాదు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడిపై వైసీపీ నాయకుల దాడి



చికిత్స పొందుతున్న బాధితుడు

పెనుకొండ రూరల్, జూలై 17: రొద్దం మండలంలోని కంచిసముద్రంలో బుధవారం టీడీపీ నాయకుడు రాజగోపాల్‌పై వైసీపీ నాయకులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు రాజగోపాల్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కంచిసముద్రం గ్రామానికి చెందిన రాజగోపాల్ కొన్నినెలల క్రితం అదే గ్రామానికి చెందిన గోపాల్‌కు షెడ్డు నిర్మాణం కోసం నగదు ఇచ్చాడు. అందులో గోపాల్ కొంత తిరిగి ఇచ్చేశాడు. మిగిలిన నగదును అడిగినందుకు అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు గోపాల్, సన్న నాగప్ప, తాడెప్ప, పవన్, మురళి మూకుమ్మడిగా దాడిచేసి రాజగోపాల్‌ను తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు హుటాహుటిన దాడిలో గాయపడిన రాజగోపాల్‌ను పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ శాఖమంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు ఆసుపత్రికి చేరుకుని బాధితుడిని పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు యాదవ్, త్రివేంద్ర తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి సంతాపం

పెనుకొండ రూరల్, జూలై 17: మండలంలోని మావటూరులో టీడీపీ సీనియర్‌నాయకుడు బ్యాడిగెర రామాంజినప్ప బుధవారం నారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమం చేనేత జౌళిశాఖ మంత్రి సవిత భర్త వెంకటేశ్వరరావు మావటూరుకు వెళ్లి రామాంజినప్ప భౌతికకాయాన్ని దర్శించి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆయన వెంట టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు యాదవ్, వెంకటరమణ, రమణమ్మ, నంజుండప్ప, ముద్దన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం

హిందూపురం(పరిగి), జూలై 17: పరిగి మండల పరిధిలో పెనుకొండ సమీపంలోని హైవేలో బుధవారం ఉదయం 9-45 గంటల సమయంలో రెండు కార్లు ఢీకొన్నాయి. కొడికొండ నుంచి వస్తున్న కారు పరిగి నుంచి వస్తున్న కారును యర్రగుంట హైవేవద్ద ఢీకొంది. అయితే వాహనాల్లో ప్రయాణిస్తున్న వారు ఎటువంటి ప్రాణాపాయం లేకుండా స్వల్పగాయాలతో బయటపడినట్లు ఏఎస్‌ఐ హిదయతుల్లా తెలిపారు.



లేపాక్షిలో పూజలందుకుంటున్న విష్ణుమూర్తి





గుంతపల్లిలో ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి, జ్యోతులు మోసుకొస్తున్న మహిళలు

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు

లేపాక్షి, జూలై 17: తొలిఏకాదశిని పురస్కరించుకుని బుధవారం మండల పరిధిలోని అన్ని ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అలాగే లేపాక్షిలోని దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో వెలసిన విష్ణుమూర్తిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి విష్ణువుకు పూజలు చేశారు. అనంతరం అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

హిందూపురం(సోమందేపల్లి): తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమందేపల్లి మండలంలో బుధవారం వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమందేపల్లిలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో టీడీపీ నాయకుడు చంద్ర భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని అంజనేయస్వామి, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో తొలిఏకాదశి పండగను జరుపుకున్నారు. గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు మూల విరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

గోరంట్ల: మండల వ్యాప్తంగా తొలి ఏకాదశి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గుంతపల్లిలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద మూడురోజులపాటు వేడుకలు నిర్వహిస్తున్నట్ల ఆలయ ధర్మకర్త నర్సిరెడ్డి తెలిపారు. తొలిఏకాదశి రోజు గ్రామంలోని మహిళలు జ్యోతులను ఊరేగింపుగా ఆలయం వరకు తీసుకొచ్చారు. పురోహితులు సుధాకర్, మంజు, హరి ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో రెండోరోజు గురువారం ఎద్దులబండ్ల ప్రదర్శన, ఉట్ల పరష నిర్వహించనున్నారు.

మడకశిరటౌన్: పట్టణంలోని వివిధ దేవాలయాల్లో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటవెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే చంద్రమౌళేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. షిర్డీ సాయినాథుడి ఆలయంలో సామూహిక భగవద్గీత పారాయణం చేశారు.

పావగడ : తొలి ఏకాదశిని తాలూకా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. తాలూకా పరిధిలోని కృష్ణాపురం వెంకటేశ్వరాలయంలో, మీనకుంటపల్లి జోడుకంబాల లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురువారం నరసింహస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు.



మడకశిర షిరిడీసాయి ఆలయంలో భగవద్గీత పారాయణం





ప్రత్యేక అలంకరణలో మడకశిర కోట వెంకటేశ్వరస్వామి, పావగడ తాలూకా కృష్ణాపురంలో వెంకటేశ్వరస్వామి

నేటి నుంచి టీచ్ టూల్ శిక్షణ

హిందూపురం అర్బన్, జూలై 17: నియోజకవర్గం పరిధిలోని హిందూపురం, లేపాక్షి, చిలమత్తూరు, పెనుకొండ, నియోజకవర్గంలోని పరిగి, మడకశిర నియోజకవర్గంలోని మడకశిర, రొళ్ళ, అగళి, గుడిబండ, అమరాపురం మండలాల ఉపాధ్యాయులకు గురువారం నుంచి టీచ్ టూల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గంగప్ప తెలిపారు. తొమ్మిది మండలల్లోని సీనియర్ ఎస్‌జీటీలకు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలకు, స్కూల్ అసిసెంట్లకు, హెచ్ఎంలకు టీచ్‌టూల్ అబ్జర్వేషన్‌పై ఈ నెల 18 నుంచి 27వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. హిందూపురం ఎంజీఎం పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. సమాచారం అందుకున్న ఉపాధ్యాయులు తప్పక హాజరు కావలని కోర్స్ డైరెక్టర్, ఎంఈఓ గంగప్ప తెలిపాడు.

మంత్రిని కలిసిన గుండుమల తిప్పేస్వామి



మంత్రితో సమావేశమైన గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, జూలై 17: రాష్ట్ర మైనారిటీ, న్యాయ శాఖ మంత్రి ఎండీ ఫరూక్‌ను బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మర్యాద పూర్వకంగా విజయవాడలోని ఆయన నివాసంలో కలిశారు. మడకశిర నియోజకవర్గంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మడకశిర అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని మంత్రిని కోరినట్లు గుండుమల తెలిపారు.

బ్యాంక్ కోసం టీడీపీ సంతకాల సేకరణ

హిందూపురం(సోమందేపల్లి). జూలై 17: మండల కేంద్రంలో ప్రస్తుతం ఉన్న కెనరాబ్యాంక్‌తోపాటు మరో బ్యాంక్ ఏర్పాటుకు టీడీపీ నాయకులు సిద్దలింగప్ప, మద్దిలేటి, సురేష్, రమేష్ ఆధ్వర్యంలో బుధవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30వేల జనాభా కలిగి చేనేత పరిశ్రమకు నిలయమైన సోమందేపల్లిలో ఒకే బ్యాంక్ ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మరో బ్యాంక్ అవసరం చాలా ఉందన్నారు. సమస్యను ఇటీవల మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సేకరించిన సంతకాలతో కూడిన వినతిపత్రం మంత్రి సవితకు అందజేస్తామని తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో స్పెయిన్ దేశస్థుల పర్యటన

రొళ్ళ, జూలై 17: గ్రామీణ ప్రాంతాల్లోని ఆచార సంప్రదాయాలను పరిశీలించేందుకు స్పెయిన్‌దేశస్థులు బుధవారం పర్యటించారు. రొళ్ల మండలం జీజీ హట్టి, హెచ్‌టీ హళ్లి గ్రామాల్లో యుక్తవయసు బాల బాలికలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆర్డీటీ సహకారంతో పర్యవేక్షిస్తామని తెలిపారు. బాలికలను ఉన్నత విద్యకు పోత్సహించాలని ఆర్డీటీ ప్రతినిధులు వారి తల్లిదండ్రులకు వివరించారు. హెచ్‌టీ హళ్లిలో ఒంటిరి మహిళ అమ్మాజక్క గృహాన్ని ప్రారంభించారు. ఈకార్యక్రమంలో స్పెయిన్ దేశస్థులు కరీలా, ఆనా, రాకెల్, రొళ్ల ఏటీఎల్ ఓబుళేషు, ఆర్డీటీ ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అనంతపురం క్రైం,జూలై 17: అనంతపురం రూరల్ మండల పరిధిలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సిండికేట్‌నగర్‌కు చెం దిన హరిబాబు(31) బుధవారం సాయంత్రం తన ఇంట్లోని గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకునే ప్రయత్నం చేశాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్నట్లు వైద్యవర్గాలు తెలిపాయి.

ఘనంగా ఏకలవ్య జయంతి



ఏకలవ్యుడి జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎరుకల సంఘం నాయకులు

గోరంట్ల, జూలై 17: ఎరుకల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గోరంట్లలో ఏకలవ్యుడి జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉమాశంకర్ ఆధ్వర్యంలో ఏకలవ్యుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకల వారి ఆరాధ్యదైవమైన ఏకలవుని జయంతిని ప్రభుత్వం అధికారికంగా జరిపించాలని, సెలవు దినంగా ప్రకటించాలన్నారు. ఎరుకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎరుకుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుజ్జల రవి, మహిళా అధ్యక్షురాలు గంగులమ్మ, ప్రధాన కార్యదర్శి సాకే వెంకటరాముడు, గోరంట్ల పట్టణాధ్యక్షుడు నరసింహులు, నారాయణస్వామి పాల్గొన్నారు.

'సర్వేను అడ్డుకున్నారు.. చర్యలు తీసుకోండి'

పెనుకొండ, జూలై 17: పెనుకొండ పట్టణంలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన భూ మిని సర్వే చేయిస్తుండగా... అడ్డుకున్న బొక్సంపల్లికి చెందిన రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని బహుజన చైతన్య వేదిక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ కోరారు. ఆయన బుధవారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ... అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి జిల్లా కలెక్టర్, తహసీల్దార్ పట్టణంలోని 668-14సర్వే నంబరులో 50సెంట్ల స్థలాన్ని కేటాయించారన్నారు. దానిని సర్వే చేయిస్తుండగా... బొక్సంపల్లి రామాంజనేయులు వచ్చారన్నారు. ప్రభుత్వం సర్వేనంబరు 668-8లో తనతోపాటు 21మందికి ఇంటిపట్టాలు మంజూరు చేసిందని, ఈ స్థలం అందులోకే వస్తుందంటూ సర్వేను అడ్డుకున్నారన్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చైతన్యవేదిక నాయకులు పాల్గొన్నారు. దీనిపై బొక్సంపల్లి రామాంజినేయులు మాట్లాడుతూ... శివరామక్రిష్ణ తనపై చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. సర్వేనంబరు 668లో 13లెటర్ మాత్రమే ఉందని అందులో సర్వే నంబరు 668-8లో 3.63ఎకరాల్లో 21మందికి రెవెన్యూవారు ఇంటిపట్టాలు ఇచ్చారన్నారు. అంబేడ్కర్ భవనానికి ఇచ్చిన సర్వేనంబరు 668-14 ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడంలేదన్నారు.

మహిళా క్రికెట్ పోటీల్లో పలుజట్ల విజయం

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 17: మహిళా క్రికెట్ పోటీల్లో పలు జట్లు విజయం సాధించాయి. బుధవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సీనియర్ మహిళా అంతర్ జోనల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. చిత్తూరు, సౌత్‌జోన్ జట్లు తలపడగా 30.5 ఓవర్లలో 70పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన సౌత్‌జోన్ 25.4ఓవర్లలో 4వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మరో మ్యాచ్‌లో నార్త్‌జోన్, విశాఖపట్నం జట్లు తలపడగా నార్త్ జోన్ జట్టు 9వికెట్లు కోల్పోయి 211 పరుగులు సాధించింది. అనంతరం బరిలోకి దిగిన విశాఖపట్నం జట్టు 43.2ఓవర్లలో 3వికెట్లు కోల్పోయి 215పరుగులు సాధించి గెలుపొందింది. హర్షిత 81పరుగులు చేసింది. సెంట్రల్‌జోన్, కృష్ణ జట్లు మధ్య జరగగా సెంట్రల్ జోన్ నిర్ణీత 50ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 250పరుగులు చేసింది. హెన్రిట్టా 97పరుగులు చేసింది. అనంతరం బరిలోకి దిగిన కృష్ణా 22.4ఓవర్లలో 209పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. సెంట్రల్ జోన్ 41పరుగులు తేడాతో విజయం సాధించింది. కీప్ ఆంధ్రా ఫ్రైడ్ మచ్చా రామలింగారెడ్డి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అసిస్టెంట్ మేనేజర్ మాధురి తదితరులు పాల్గొన్నారు.

విజయసాయి రెడ్డిపై భగ్గుమన్న జర్నలిస్టులు



పురంలో సీఐకి ఫిర్యాదు చేస్తున్న పాత్రికేయులు



పెనుకొండలో నిరసన తెలుపుతున్న దృశ్యం



మడకశిరలో ర్యాలీ

హిందూపురం అర్బన్, జూలై 17: మీడియాపై, మీడియా యాజమాన్యాలపై రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం హిందూపురంలో స్థానిక ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రెస్‌క్లబ్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయసాయిరెడ్డి విచక్షణ కోల్పోయి మాట్లాడారన్నారు. బేషరుతుగా మీడియాకు క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తాయని హెచ్చరించారు. అనంతరం వన్‌టౌన్ సీఐ శ్రీనివాసులుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులతోపాటు సీపీఐ దాదాపీర్, బీఎస్పీ శ్రీరాములు, ఎస్ఎఫ్ఐ బాబావలి, ఎంఎస్ఎఫ్ రవి, పెద్ద ఎత్తున విలేకరులు హాజరయ్యారు.

పెనుకొండ టౌన్: మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయ్‌సాయిరెడ్డిపై కేసు నమోదు చేయాలని జర్నలిస్టులు డిమాండ్ చేశారు. విజయ్‌సాయిరెడ్డి వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బుధవారం నిరసన చేపట్టారు. మద్దతుగా టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు. అనంతరం డీఎస్పీ బాబిజాన్‌సైదాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు, ఎంపీగా పనిచేసిన విజయ్‌సాయిరెడ్డి జర్నలిస్టలపై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తప్పుబట్టారు.

మడకశిరటౌన్: విశాఖపట్నం మీడియా సమావేశంలో జర్నలిస్టులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయసాయిరెడ్డిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మడకశిర పట్టణంలో జర్నలిస్టులు బుధవారం ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమరాపురం బస్టాండు ఆవరణలో నిరసన చేపట్టారు. అనంతరం మడకశిర సర్కిల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టులకు ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో హెడ్‌కానిస్టేబుల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మడకశిర జర్నలిస్టు యూనియన్ నాయకులు, వివిధ పత్రికల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

జలధికి తరలిన పీర్లు



తాజ్‌బాబా ఆధ్వర్యంలో పీర్లను జలధికి తరలిస్తున్న దృశ్యం



హాజరైన ప్రముఖులు

పెనుకొండ, జూలై 17: మొహరం వేడుకల సందర్భంగా స్థానిక బాబయ్యస్వామి దర్గా సమీపంలోని దివాన్‌ఖానాలో ఏర్పాటు చేసిన 72 పీర్లతోపాటు పట్టణంలోని వివిధ చావిళ్లలో ఏర్పాటు చేసిన పీర్ల జలధి కార్యక్రమాన్ని ఆఖరిరోజు బుధవారం రాత్రి అట్టహాసంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి తాజ్‌బాబా ఆధ్వర్యంలో పీర్లను దివాన్‌ఖానా నుంచి ఊరేగింపుగా బాబయ్య చెరువుకు తీసుకెళ్లారు. చెరువులో జలధి చేశారు. అనంతరం పీర్లను ఆయా చావిళ్లలో భద్రపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సవిత భర్త వెంకటేశులు, మాధవనాయుడు, త్రివేంద్రనాయుడు, కన్వీనర్ శ్రీరాములుయాదవ్ దాదు, డీఎస్పీ బాబిజాన్‌సైద, సీఐ యుగంధర్, ఎస్ఐ తదితరులు హాజరయ్యారు. హాజరైన వారికి తాజ్‌బాబా ఆధ్వర్యంలో భోజన సదుపాయం ఏర్పాటు చేశారు.



రత్నగిరిలో ప్రత్యేక అలంకరణలో పీర్లు

రొళ్ల : మండలంలోని రత్నగిరిలో మొహరం పురస్కరించుకొని పీర్ల జలధి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. వేల మంది భక్తులు వచ్చి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండంలో ప్రవేశించి మొక్కులు తీర్చుకొన్నారు. అనంతరం సాయంత్రం పీర్లను జలధికి తరలించారు.

కొలువుదీరిన పీర్లు



మారెమ్మ గుడి వీధి చావిడిలో కొలువుదీరిన పీర్లు

మడకశిరటౌన్: పట్టణంలోని మారమ్మగుడివీధి, తేరుబయలు, గాంధీ బజార్ చావిళ్లలో పీర్లను ఏర్పాటు చేశారు. భక్తులు పీర్ల వద్ద చక్కెర, శనగపప్పులు, బెల్లం చదివింపులు చేయించారు. గురువారం తెల్లవారుజామున అగ్నిగుండ మహోత్సవ కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేశారు.



అమరాపురంలో అగ్నిగుండ ప్రవేశం, పీర్లు (ఇన్‌సెట్‌లో..)

మడకశిర(అమరాపురం), జూలై 17: మండల కేంద్రమైన అమరాపురంలో మొహరం వేడుకలను మంగళ, బుధవారాలు నిర్వహించారు. పీర్లకు చక్కెర చదివింపులు చేశారు. బుధవారం తెల్లవారుజామున అగ్నిగుండప్రవేశం చేసి మొక్కులు చెల్లించారు. పీర్లకు చోళమాంబదేవి దేవాలయం వద్ద ప్రార్థనలు చేసి, అమరాపురం పురవీధుల్లో ఊరేగించారు.





ఆలూడిలో పీర్లను ఎత్తుకున్న భక్తులు, అగ్నిగుండ ప్రవేశానికి సిద్ధంగా...

అగళి: మండలంలోని ఆలూడి గ్రామంలో మొహరం సందర్భంగా బుధవారం తెల్లవారుజామున భక్తులు పీర్లను ఎత్తుకుని అగ్నిగుండం ప్రవేశం చేశారు. వందల మంది భక్తులు తరలివచ్చి పీర్లకు చక్కెర చదివింపులు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు.



పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

పావగడ: మొహరం వేడుకలను పట్టణంలోని దళవాయి వీధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. బాబయ్య గుడి అగ్ని గుండం వెలిగించారు. ముతువల్లి అజ్మతుల్లా, షౌకత్, రియాజ్ తదితరుల ఆధ్వర్యంలో పీర్లను పుర వీధుల్లో ఊరేగంచారు

ఉన్నోళ్లకు ఇళ్లు.. లేనోళ్లకు కన్నీళ్లు

సొంత ఇంటి కోసం ఓ అభాగ్యురాలి ఆవేదన



నిరాశ్రయ మహిళకు సరుకుల కిట్ ఇస్తున్న హెల్ప్ సొసైటీ అధ్యక్షుడు

పావగడ, జూలై 17 : ప్రభుత్వం ఎన్నో పథకాల కింద నిరుపేదలకు ఇళ్లు నిర్మించాలని ఆదేశించినా అధికారులు మాత్రం ఉన్న వారికే ఇళ్లు నిర్మిస్తూ... లేని వారికి కన్నీళ్లు మిగులిస్తున్నారు. తాలూకా పరిధిలోని వైఎన్‌హొసకోట ఎస్సీ కాలనీకి చెందిన దేవి అనే అవివాహిత మహిళ తల్లిదండ్రులను కోల్పోయి ఆరేళ్ల నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తోంది. ఇల్లు నిర్మించుకునేందుకు చేతకాక బ్యానర్లు పైకప్పుగా వేసుకుని రిపీస్‌కట్టెలను అడ్డగోడలుగా కట్టుకుని గాలి వాన వస్తే ఎక్కడ ఎగిరిపోతాయోనన్న భయంతో ఒంటరి జీవనం సాగిస్తోంది. పీడీఓ, పంచాయతీ అధ్యక్షులకు తెలిపినా తన గోడు పట్టించుకోలేదని కన్నీటి పర్యంతమై పత్రికలకు తెలిపింది. ఈ విషయాన్ని స్థానిక హెల్ప్ సొసైటీ సంస్థ దృష్టికి తీసుకెళ్లడంతో సంస్థ అధ్యక్షుడు మానం శశికిరణ్ చొరవ తీసుకుని ఆమెకు ఇళ్లు నిర్మించడానికి అయ్యే ఖర్చులు భరిస్తామని తెలిపారు. నెలకు సరిపడే ఆహారం కిట్‌లను బుధవారం ఆమెకు అందించారు. తనకు ఇల్లు నిర్మించడానికి మందుకొచ్చిన సంస్థకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆమె ఇల్లు నిర్మించుకునేందుకు అవకాశం కల్పిస్తారని స్థానికులు ఆశిస్తున్నారు.